క్లుప్తంగా

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీఐ కరుణాకర్

ఇల్లెందురూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కరుణాకర్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇల్లెందులో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లు దాటి ఉండాలని, వాహనాలను 200 మీటర్ల దూరంలో పార్కింగ్ చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా ఎక్కడా ఉండరాదన్నారు. ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు పాలడ్పినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

సెయింట్ జోసఫ్‌లో ఆటల పోటీలు


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): మండలంలోని ధన్‌బాద్ పంచాయతీలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో బుధవారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జార్జిరెడ్డి మాట్లాడుతూ... క్రీడలు విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, శారీరక ఆరోగ్యానికి ఉపకరిస్తుందన్నారు. అందుకే పిల్లలను ప్రతీరోజు ఒక పిరియడ్ గేమ్స్ ఆడిస్తున్నామన్నారు. అంతేకాకుండా క్రీడల ప్రాముఖ్యతను చాటిచెబుతూ ప్రభుత్వాలు సైతం పలు కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయని ఇందులో బాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా ఆగస్టు 29ని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తుందన్నారు.

పాల్వంచలో 37 పోలింగ్ కేంద్రాలు

పాల్వంచ: పాల్వంచలో మొత్తం 37 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో 57 బూత్‌లు ఉన్నాయి. ఆయా కేంద్రాలకు అధికారులు పోలింగ్ సామగ్రిని తరలించి ఓటింగ్‌కు సిద్ధం చేశారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల కంటే ఒక గంట సమయం తక్కువగా భద్రాద్రి జిల్లాలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకే పోలింగ్ జరగనుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

అగ్ని ప్రమాదం

టేకులపల్లి: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి పూరిల్లు కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... టేకులపల్లి మండలం పాతతడికలపూడి గ్రామానికి చెందిన నిరుపేద, రెక్కాడితే గానీ డొక్కాడని జార రామారావు పూరి గుడిసెకు బుధవారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. స్థానికులు వెంటనే గమనించి మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో గుడిసె పాక్షికంగా కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

4 గంటలకు ముగింపు..

చుంచుపల్లి: పోలింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుంది. ఈ విషయాన్ని 15 నిమిషాల ముందే అధికారులు వెల్లడించాల్సి ఉంటుంది. నాలుగు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారందరూ ఓటు వేయడానికి అర్హులే. ఓటింగ్ పూర్తయిన తర్వాత కంట్రోల్ యూనిట్‌లో క్లోజ్ బటన్ నొక్కుతారు. మొత్తం ఓట్లు, ఓటర్ స్లిప్పులు సరిపోల్చుకుంటారు.

కౌంటింగ్ కేంద్రాలకు చేరేదిలా...

పోలింగ్ ముగిసిన వెంటనే సీల్ వేసి క్లోజ్ చేసిన ఈవీఎం యంత్రాలను ఆయా నియోజకవర్గాల్లోని పంపిణీ కేంద్రాలకు చేరుస్తారు. ఆ మరుసటి రోజు ప్రత్యేక భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన లెక్కింపు కేంద్రాల వద్ద గల స్ట్రాంగ్ రూంలోకి ఈవీఎం యంత్రాలను తరలిస్తారు.

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు చేరిన ఉద్యోగులు
- సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసుల బందోబస్తు




ఇల్లెందు: ఆదర్శ పోలింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక

ఇల్లెందు: నియోజకవర్గంలో గురువారం జరగనున్న ఎన్నికలకు సిబ్బంది, సామగ్రిని సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారి జే.కాశయ్య మీడియాకు తెలిపారు. నియోజకవర్గంలో 241 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 36 మంది రూట్ అధికారులు, 32 మంది సెక్టార్ అధికారులు, 300 మంది పీఓలు, 300 మంది ఏపీఓలు, ఓపీఓలు 600 మంది, సూపర్వైజర్లు 30 మందిని నియమించారు. నియోజకవర్గంలో ఐదు మండలాలతో పాటు పట్టణంలో 2,19,569 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,07,909, స్త్రీలు 1,11,658, ఇతరులు ఇద్దరు ఉన్నారు. నియోజకవర్గంలో 138 గ్రామ పంచాయతీలు ఉండగా 54 రెవెన్యూ గ్రామాలు, 241 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బయ్యారంలో 1 – 43, ఇల్లెందులో 44 – 130, టేకులపల్లిలో 131 – 174, గార్లలో 175 – 205, కామేపల్లిలో 206 – 241 వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇల్లెందు సింగరేణి స్కూల్ నుంచి బస్సుల్లో ఈవీఎంలు, ఇతర మెటీరియల్‌ను అధికారులు, పోలీసు బందోబస్తు మధ్యన పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఇదిలా ఉండగా కలెక్టర్ ప్రియాంక సింగరేణి స్కూల్‌లో మెటీరియల్ తరలింపును సందర్శించి పరిశీలించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనుందన్నారు. 241 పోలింగ్ కేంద్రాల్లో 258 మంది పోలీసులను, సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ, లోకల్ పోలీసులు, హోంగార్డులతో పాటు ఫారెస్టు, ఎక్సైజ్ సిబ్బందిని కూడా వినియోగించనున్నట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. 31 సమస్యాత్మక గ్రామాలు, 17 అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. 2,589 మంది సిబ్బందిని నియమించారు.


జూలూరుపాడు: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

కేంద్రం తనిఖీ..

ఇల్లెందులోని సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో పంపిణీ జరుగుతున్న ఎన్నికల మెటీరియల్ పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక సందర్శించి పరిశీలించారు. గురువారం జరిగే ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఉదయం 7 నుంచి సాయత్రం 4గంటల లోపు ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.

జూలూరుపాడు: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు గురువారం పోలింగ్ జరగనున్నట్లు జూలూరుపాడు తహసీల్దార్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శారద తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జూలూరుపాడు మండలంలో 27 లోకేషన్ల పరిధిలో 36 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈ పోలింగ్ స్టేషన్లలో 27,632 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు చెప్పారు. హోమ్ ఓటింగ్ ద్వారా 31 మంది దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చెప్పారు. ఎన్నికల విధులకు 144 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని, ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒక్కొక్కరు చొప్పున 36 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 36 మంది, ఇతర సిబ్బంది 72 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది..

జూలూరుపాడు మండలంలోని 36 పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రితో బుధవారం సాయంత్రానికి చేరుకున్నారు. మూడు రూట్స్, మూడు సెక్టార్లలోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది వైరా నుంచి ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తుతో చేరుకున్నారు.

సుజాతనగర్: నేడు జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవారం ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. మండలంలో 4 రూట్లలో మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 21,829 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో 10,812 మంది పురుషులు కాగా, 11,017 మంది మహిళలు ఉన్నారు. 24 పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో కేంద్రానికి నలుగురు చొప్పున సిబ్బందిని నియమించారు. నేటి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జి.శిరీష తెలిపారు.

టేకులపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం జరగనున్న పోలింగ్‌కు టేకులపల్లి మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలానికి చెందిన ఎన్నికల సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 131 – 174 వరకు మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పాతతడికలపూడి, కోక్యాతండా రెండిటినీ సమస్యాత్మక కేంద్రాలుగా ప్రకటించారు. మొత్తం 8 రూట్లు, 31 లోకేషన్లలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఇద్దరు ఈపీఓలు, ఇద్దరు పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు కలిపి మొత్తం 150 వరకు సిబ్బంది, అధికారులు విధులు నిర్వహించనున్నారు. మండలంలో ఎన్నికల నిర్వహణ, బందోబస్తు, శాంతి భద్రతల పరిరక్షణను సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు రమణారెడ్డి, రంజిత్ పర్యవేక్షించారు.


టేకులపల్లి: కోక్యాతండా పోలింగ్ కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు


టేకులపల్లి: పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు


సుజాతనగర్: జిల్లా పరిషత్ పాఠశాలకు చేరిన ఎన్నికల సిబ్బంది


టేకులపల్లి: పాత తడికలపూడిలో పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ఎన్నికల నియమావళిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సీఐ

సుజాతనగర్: ఎన్నికల నియమావళిపై ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చుంచుపల్లి సీఐ పెద్దన్న కుమార్ అన్నారు. సుజాతనగర్ సెంటర్‌లో ఎన్నికల నియమావళిపై స్థానికులకు బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరు అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోసం పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సోమేశ్వర్, సిబ్బంది సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చింతలపూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మద్యం, నగదు పంపిణీ

టేకులపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సాయంత్రమే ప్రచారాలు ముగియడంతో ఆ రోజు రాత్రి నుంచే టేకులపల్లి మండలంలో ప్రధాన రాజకీయ పార్టీలు పంపకాలు మొదలు పెట్టారు. కొన్ని గ్రామాల్లో ప్రచారాల సమయంలోనే ఇంటింటికీ కేజీ చికెన్ చొప్పున పంపిణీ చేశారు. తాజాగా గ్రామాలకు మేకపోతులు కూడా అందజేశారు. వీటితో పాటు ముందస్తుగానే యథేచ్ఛగా మద్యం బాక్సులను గ్రామాలకు తరలించి రహస్య ప్రాంతంలో భద్రపరిచి బుధవారం రాత్రి మద్యం పంపిణీ జరిగింది. మహిళలకు కూడా బీర్లు అందజేసినట్లు సమాచారం. ప్రధాన పార్టీలు పోటాపోటీగా నగదు పంపిణీలో నిమగ్నమయ్యాయి. ఒకరు ఓటుకు రూ.1000 ఇస్తే మరొకరు రూ.1200 చొప్పున ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. ఇదిలా ఉండగా ప్రధాన పార్టీల నాయకులు సకాలంలో నగదు ఇవ్వకపోవడం, పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో పంపిణీ చేసే నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కొందరు నాయకుల చేతివాటం వల్ల ఓటర్లకు రూ.500 నుంచి రూ.900 వరకే పంపిణీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నాయకులు వస్తారని....డబ్బులు ఇస్తారని ఎదురు చూస్తున్న కొందరు ఓటర్లకు నిరాశ చెంది ముందుగా అనుకున్న పార్టీకి కాకుండా వేరే పార్టీకి ఓటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.


వీడియోలోని ఓ దృశ్యం

పాల్వంచ: ఎన్నికల నేపథ్యంలో పలువురు అభ్యర్థులు వారి అనుచరులతో డబ్బులను భారీ ఎత్తున పంపిణీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్ ప్రకారం ఓటుకు రూ.1000 నుంచి రూ.1500 వరకు డబ్బులు పంపిణీ చేయడం బహిరంగ రహస్యంగా మారింది. కొందరు నేతల ఇళ్లల్లో, ఓ ప్రైవేట్ వైద్యశాల కేంద్రంగా డబ్బులు పంపిణీ జరుగుతోందనే ప్రచారం జరిగింది. డబ్బుల పంపిణీపై పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం..


మండలకేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న చెట్టు

సుజాతనగర్: స్థానిక ప్రధాన కూడలిలోని మర్రి చెట్టు పూర్తిగా ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. గ్రామంలో ల్యాండ్ మార్క్‌గా ఉన్న ఈ వృక్షానికి తెగులు సోకడంతో కొమ్మలన్నీ ఎండిపోయాయి. ప్రధాన కూడలి కావడంతో ఈ చెట్టు కింద నుంచే నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా చుట్టుపక్కలవారు చెట్టునీడన చేరి కాలక్షేపం చేస్తుంటారు. ఎండాకాలం వచ్చిందంటే ఈ చెట్టునీడకు గిరాకీ. స్థానికులంతా వచ్చి ఈ చెట్టు కిందనే కబుర్లు చెప్పుకుంటారు. చెట్టు కిందనే విద్యుత్ తీగలు కూడా ఉన్నాయి. ఈ చెట్టు ఎప్పుడైనా పడిపోయేలా ఉంది. ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గ్రామ పంచాయతీ, విద్యుత్ అధికారులు స్పందించి ఆ చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పున్నయ్య మృతికి సంతాపం


పున్నయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాందాస్ నాయక్, వెంకటరెడ్డి

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, సాయి తిరుమల ఎంటర్ ప్రైజెస్ యజమాని మంగముడి నాగేశ్వరరావు తండ్రి మంగముడి పున్నయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుధవారం పున్నయ్య దశదిన కర్మ కార్యక్రమానికి పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పున్నయ్య చిత్రపటానికి వైరా కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి నరసింహారావు, నర్వనేని పుల్లారావు, ధరావత్ రాంబాబు, సాయిల కృష్ణయ్య, వేల్పుల నరసింహారావు, పోతురాజు నాగరాజు, పణితి వెంకటేశ్వర్లు, చింతా జగన్నాథం, బానోత్ హాతిరామ్, కొండెం జోగారావు, మందా బాబు తదితరులు ఉన్నారు.

స్పెషల్ లీవ్ మంజూరు చేయండి

సింగరేణి(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నవంబర్ 29, 30 తేదీలలో సింగరేణి ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో వారికి డిసెంబర్ 1న స్పెషల్ లీవ్ మంజూరు చేయాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) హనుమంతరావుకు సీఐటీయూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసే వారికి నవంబర్ 29, 30 తేదీల్లో ఎలక్షన్ డ్యూటీలో పనిచేసిన వారికి డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇస్తున్నారని సింగరేణి అధికారులు మాత్రం ఈ విషయంలో పట్టించుకోవటం లేదన్నారు. సింగరేణి యాజమాన్యం తక్షణమే మరోసారి పునరాలోచించి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా డిసెంబర్ 1న స్పెషల్ లీవ్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకొని సింగరేణి అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు, విజయగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శంగా.. ఆకట్టుకునేలా పోలింగ్ కేంద్రం



సుభాష్‌నగర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన యువ పోలింగ్ కేంద్రం

ఇల్లెందురూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు కీలక పాత్ర పోషిస్తాయి. ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం ఎంతో కీలకం. గతం కంటే ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం పలు సంస్కరణలు తీసుకొచ్చింది. పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించింది. దీనికి తోడు పోలింగ్ కేంద్రాలు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో పలుచోట్ల ప్రయోగాత్మకంగా ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఎన్నికల సంఘం ఈసారి అన్ని నియోజకవర్గ కేంద్రాలలో అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రస్తుత శాసన సభ ఎన్నికల్లో మహిళ, యువ, దివ్యాంగ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఇల్లెందు నియోజకవర్గ కేంద్రంలో సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో యువ, స్టేషన్ బస్తీ పాఠశాలలో మహిళ, మెయిన్‌రోడ్డు పాఠశాలలో దివ్యాంగ పేరుతో పోలింగ్ కేంద్రాలకు నామకరణం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా ఆయా పోలింగ్ కేంద్రాల ముఖద్వారాలను ఫ్లెక్సీలతో అలంకరించారు.

ఓట్ల బదలాయింపు జరిగేనా...?

- క్రాస్ ఓటింగ్‌పై ఆశలు
- అభ్యర్థులు టెన్షన్.. టెన్షన్



ఇల్లెందు: ఓట్ల బదలాయింపు జరుగుతుందని పార్టీలు, నేతలు, అభ్యర్థులు ఆశలు పెంచుకున్నారు. దీనిపైనే గెలుపు, ఓటముల లెక్కలు చెబుతున్నారు. నేతలు, అభ్యర్థులు, పార్టీల మధ్య జరిగిన అంగీకారాలకు ఓటర్లు తమ ఓటును బదలాయిస్తారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఓటరు తాను వేయబోయే అభ్యర్థిని ఎంచుకుని ఉన్నాడని, ఎవరు ఏం చెప్పినా వినడం, డబ్బులు ఇచ్చినా తీసుకోవడం, ఓటు మాత్రం నిర్ణయించుకున్న నేతలకు వేసేందుకు పదిలంగా, పటిష్టమైన అభిప్రాయంతో ఉన్నట్లు పరిశీలకులు, తలలు పండిన నేతలు పేర్కొంటున్నారు. క్రాస్ ఓటింగ్ భారీగా జరుగుతుందని అంచనాలు వేసుకుంటున్నారు. ఎవరికి వారే గెలుపు ధీమాతో లెక్కలు వేసుకుంటున్నారు. ఇల్లెందు అసెంబ్లీ స్థానానికి 20 మంది బరిలో ఉండగా, ప్రధానంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, ఎన్డీ, బీఎస్పీలు పోటీలో ఉన్నప్పటికీ పోరు మాత్రం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే ఉంది. ఒకనాడు పెట్టని కోటగా ఉన్న కాంగ్రెస్, టీడీపీల ఓటు బ్యాంక్ అభ్యర్థుల తీరుతో మారుతూ వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి, రెండు నెలల ముందు అభ్యర్థిత్వం ఖరారు చేయటం అధికార పార్టీ అభ్యర్థికి తోడైంది. మిత్రపక్షాల మద్దతు తోడు కాగా కాంగ్రెస్ అభ్యర్థిత్వం చివరి సమయంలో ప్రకటించటం, ఉన్న సమయంలో అధికార పక్షానికి ధీటుగా ప్రచారంలో హోరెత్తించటం కాంగ్రెస్ నైజంగా మారింది. బీజేపీ అభ్యర్థి మాత్రం తనకు ప్రధాని మోదీ పాలన, మరోవైపు బంజారాలకు ఎస్టీ జాబితాలో కల్పించినందున తనను బంజారా గాంధీగా పేర్కొంటుండటంతో ఆ వర్గం తనకు అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు. అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ బెంగ, భయం, ఆశ నెలకొని ఉంది. ఓటింగ్ సమయం ఆసన్నం కావడంతో టెన్షన్ నెలకొంది. ఈ ఎన్నికలు ఓటరును డబ్బు వైపు లాగాయి. అన్ని పార్టీల నుంచి ఓటరు డబ్బు ఇస్తే తీసుకోవాలనే ఆశతో ఎదురు చూస్తున్నాడు. ఇలాంటి పరిస్థితిలో చివరి సమయానికి అభ్యర్థుల చేతుల్లో డబ్బులు నిండుకున్నాయి. డబ్బు ఇవ్వనిదే ఓటు వసే పరిస్థితి లేని ఓటరు, డబ్బు ఇవ్వని వారి వైపు చూసే అవకాశం కనిపించడం లేదు. అయినా ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో 'సిరా' చుక్క బయోగ్రఫీ

కొత్తగూడెంటౌన్: ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల కోలాహలం నెలకొంది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. అయితే ఎన్నికలంటే మనకు ఠక్కున గుర్తొచ్చేది సిరా చుక్క. ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్న తరువాత చేతి వేలికి సిరా మార్క్ చూపిస్తూ.. 'నేను ఓటేశానోచ్..'అంటూ సగర్వంగా చెప్పుకుంటారు. ఇంకొందరు సెల్ఫీలు తీసుకొని సోషల్ మీడియాలోనూ అప్‌లోడ్ చేస్తారు. అయితే ఎన్నికల్లో వాడే సిరా మార్క్ వేసిన తరువాత మనం ఎంత తుడిచినా పోదు. ఒక్కసారి సిరా గుర్తు వేలిపై పడితే.. 72 గంటల వరకు ఎట్టి పరిస్థితిలో చెరిగిపోదు. మరోసారి బోగస్ ఓట్లు (దొంగ ఓట్లు) వేయకుండా ఎన్నికల సంఘం దీన్ని అమలు చేస్తోంది. ఎన్నికల్లో పోలింగ్ రోజున ఓటు వినియోగించుకున్న ఓటర్లను గుర్తించేందుకు వీలుగా చేతి వేలికి చెరిగిపోని సిరా వేస్తారు. ఓటు వేయడానికి ముందు ఓటర్ల ఎడమ చేయి చూపుడు వేలుకు సిరా వేస్తారు. గోరు మీది నుంచి వేలి మొదటి జాయింట్ వరకు వేస్తారు. ఆ తర్వాతే ఓటు వేయాల్సి ఉంటుంది. ఎడమ చేయి చూపుడు వేలు లేని పక్షంలో మధ్య వేలు.. లేదంటే ఉంగరపు వేలు, లేదా చిటికెన వేలు, బొటన వేలికి గానీ వేస్తారు. ఎడమ చేయి లేనిపక్షంలో ఇదే వరుసలో కుడిచేతికి సిరా పెట్టాల్సి ఉంటుంది. రెండు చేతులకు వేళ్లు లేనట్లయితే ఎడమ భుజం, ఏదైనా కనిపించే ప్రదేశం, లేదా ముఖంపై సిరాతో గుర్తించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటు వేయలేని స్థితిలో ఉంటే వారు ఓటు వేయడానికి సహకరించేందుకు వెళ్లే వారికి కుడి చేతి చూపుడు వేలుకు సిరా వేస్తారు.

